సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం । 2 । జూలై । 2023



నిత్యాన్నదానానికి విరాళం
ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు గొర్ల శ్యాంప్రసాద్ (ఏలూరు) రూ.1,11,116, బొర్రా ప్రసాద్ (ఉంగుటూరు మండలం గుళ్లపాడు) రూ.1,00,116లను విరాళంగా అందజేశారు.



సికిల్‌సెల్‌పై అవగాహన
బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): జీలుగుమిల్లి పీహెచ్‌సీలో శనివారం సికిల్‌సెల్ అనీమియాపై డీఎంహెచ్‌ఓ ఆశ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

పారిజాతగిరి.. భక్తజన సిరి
జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలోని గోకుల తిరుమల పారిజాత గిరిలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు 108 ప్రదక్షిణలు చేసి స్వామిని దర్శించుకున్నారు.



న్యూస్‌రీల్

హాస్టళ్లను పరిశీలించిన హైకోర్టు న్యాయమూర్తి



శనివారపుపేట హాస్టల్‌లో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న న్యాయమూర్తి రమేష్

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని గురుకుల పాఠశాలలు, ఎస్సీ హాస్టళ్లను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.రమేష్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా శనివారపుపేటలోని బాలుర వసతి గృహాన్ని పరిశీలించి విద్యార్థులకు అందుతున్న సేవలు, పరిశుభ్రతను పరిశీలించారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో చిల్డ్రన్ సూపరింటెండెంట్, సీడబ్ల్యూసీ సభ్యులు, విద్యాశాఖాధికారులు, జిల్లా ఉన్నతాధికారులతో సమీక్షించారు. అనంతరం వట్లూరు, పోలసానిపల్లి, ద్వారకా తిరుమల, కుమారదేవంలో బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు, దేవరపల్లి మండలం చిన్నాయగూడెంలో సోషల్ వెల్ఫేర్ బాలికల హాస్టల్‌ను సందర్శించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్, పోక్సో కోర్టు జడ్జి ఎస్.ఉమాసునంద, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి, జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యులు, సీడబ్ల్యూసీ సభ్యులు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

రూ.2.21 కోట్ల పంటల బీమా మంజూరు
ఏలూరు (మెట్రో): ఏలూరు జిల్లాలో ఖరీఫ్–2022కు సంబంధించి పత్తి, వరి సాగు చేసిన రైతులకు వైఎస్సార్ పంటల బీమా కింద రూ.2,21,32,246 పరిహారం మంజూరైందని జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 12 మండలాల్లో 63 రైతు భరోసా కేంద్రాల పరిధిలో 3,161 మంది రైతులకు సంబంధించిన 7174.8 ఎకరాలకు బీమా మంజూరైందన్నారు.

ఆర్టీసీ స్థలాల లీజుకు టెండర్ల ఆహ్వానం
ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని బస్ స్టేషన్లలో ఉన్న ఖాళీ స్థలాలను 15 ఏళ్లపాటు లీజుకు ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రజా రవాణా అధికారులు ఎన్వీఆర్ వరప్రసాద్ (ఏలూరు), ఎ.వీరయ్యచౌదరి (పశ్చిమగోదావరి) సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఏలూరు జిల్లాలోని కలిదిండి, కైకలూరులో రెండేసి బిట్లు, ద్వారకా తిరుమల, కొయ్యలగూడెం, కామవరపుకోట బస్‌స్టేషన్లలో ఒక్కో బిట్టు, పశ్చిమగోదావరి జిల్లాలోని మార్టేరు, ఆకివీడు బస్‌స్టేషన్లు, భీమవరంలో స్టాఫ్ క్వార్టర్స్‌లో ఒక్కో బిట్టు లీజుకు ఇవ్వనున్నామని పేర్కొన్నారు. స్థలాల వివరాలు ఆర్టీసీ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని తెలిపారు. అభ్యర్థులు ఈనెల 20న విజయవాడలోని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యాలయంలో బిడ్లు దాఖలు చేయాలని కోరారు.

ప్రశాంతంగా ఓపెన్ స్కూల్ పరీక్షలు
ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ఆధ్వర్యంలో టెన్త్, ఇంటర్ కోర్సుల సప్లిమెంటరీ పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. టెన్త్ సాంకేతిక పరిజ్ఞానం పరీక్షకు 573 మందికి 463 మంది, ఇంటర్ భౌతికశాస్త్రం పరీక్షకు 250 మందికి 213 మంది, రాజనీతి శాస్త్రం పరీక్షకు 223 మందికి 193 మంది హాజరయ్యారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగలేదని డీఈఓ ఎస్వీ రవిసాగర్ తెలిపారు.

ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడిగా గూడవల్లి
ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా ఏలూరు నగరానికి చెందిన గూడవల్లి శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కోన శ్రీనివాస్ శనివారం నియామక పత్రం అందించారు.

సంక్షేమానికి సురక్షా పథం

జగనన్న సురక్ష.. పేదలకు రక్ష
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సురక్ష క్యాంపులు
- ఏలూరు జిల్లాలో 24 సచివాలయాలు.. 'పశ్చిమ'లో 53 సచివాలయాల్లో నిర్వహణ
- వేలాది ధ్రువీకరణ పత్రాల జారీ



తాడేపల్లిగూడెం మండలం చినతాడేపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



ఉండి మండలం పాందువ్వ గ్రామ సచివాయం వద్ద ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

సాక్షి ప్రతినిధి, ఏలూరు/భీమవరం (ప్రకాశం చౌక్): ప్రజాసమస్యల సత్వర పరిష్కారం.. ప్రజల్లో సంతృప్తి స్థాయిని పెంచడం.. అర్హులైన ప్రతిఒక్కరికీ నూరు శాతం సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సచివాలయాల వారీగా క్యాంపుల నిర్వహణ ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో శనివారం ప్రారంభమైంది. గతనెల 23 నుంచి ఈనెల 23 వరకు నెలరోజులపాటు జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుబంధంగా జగనన్న సురక్షను నిర్వహిస్తున్నారు. ఏలూరు జిల్లాలో 24 మండలాల్లోని 25 గ్రామ సచివాలయాల పరిధిలో, పశ్చిమగోదావరి జిల్లాలో 53 సచివాలయాల పరిధిలో తొలిరోజు క్యాంపులు నిర్వహించారు. అన్ని నియోజకవర్గాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

11 రకాల సేవలు ఉచితం : జగనన్న సురక్షలో కుల, ఆదాయ, వివాహ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కు మొబైల్ నంబర్ అనుసంధానం, మ్యూటేషన్ లావాదేవీలు, ఫ్యామిలీ మెంబర్ల సర్టిఫికెట్, పంట సాగుహక్కు పత్రం, కొత్త రేషన్ కార్డులు, హౌస్ హోల్డింగ్ మ్యాప్ వంటి 11 రకాల సేవలను ఉచితంగా అందిస్తున్నారు. ఏలూరు జిల్లాలో 438 మంది వలంటీర్లు 24,852 ఇళ్ల వివరాలను సర్వే చేశారు. సురక్ష క్యాంపుల్లో 8,351 దరఖాస్తులు అందగా వాటిలో 6,823 అక్కడికక్కడే పరిష్కరించి మిగిలిన 1,528 దరఖాస్తులను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారు.

చురుగ్గా సర్వే : పశ్చిమగోదావరి జిల్లాలోని 20 మండలాల్లో 159 సచివాలయాలో సర్వే ప్రారంభించారు. 500 మంది వలంటీర్లు ఆరు లక్షల కుటుంబాలకు లక్ష కుటుంబాల్లో సర్వే పూర్తిచేశారు. తొలిరోజు 53 సచివాలయాల పరిధిలో 17,162 విజ్ఞప్తులు అందగా వీటిలో 14,007 పూర్తి చేశారు.

నాలుగు రోజుల్లోనే కులధ్రువీకరణ పత్రం



బుట్టాయగూడెం : ఈ ఫోటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు కొమరం దుర్గారావు. ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం మారుమూల గ్రామమైన కాకులవారిగూడేనికి చెందిన ఇతను గిరిజన తెగలకు చెందిన వ్యక్తి. తన కుమారుడు ఐటీఐ చదివేందుకు కుల ధ్రువీకరణ పత్రం అవసరం కాగా పనిమానుకుని మండల కేంద్రమైన బుట్టాయగూడెం వెళ్లి దరఖాస్తు చేసుకునేందుకు ప్రయత్నించాడు. నాలుగు రోజుల క్రితం జగనన్న సురక్ష పథకంలో భాగంగా తన ఇంటికి వెళ్లిన వలంటీర్లు కుల ధ్రువీకరణ పత్రం అవసరమని గుర్తించి దరఖాస్తు చేయించారు. శనివారం జగనన్న సురక్ష క్యాంపులో దుర్గారావుకు ఆ పత్రాన్ని అందజేశారు. దీంతో దుర్గారావు చెప్పలేని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కుల ధ్రువీకరణ పత్రం పొందాలంటే నెలలు పట్టేదని, నాలుగు రోజుల్లోనే పత్రాలు తన చేతికి రావడం ఆశ్చర్యంగా ఉందని దుర్గారావు తెలిపాడు.

పేదరికం ప్రాతిపదికనే పథకాలు

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్/తాడేపల్లిగూడెం అర్బన్: రాష్ట్రంలో పేదరికం ప్రాతిపదికనే పథకాలను అందిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. శనివారం తాడేపల్లిగూడెం మండలం చినతాడేపల్లి, తాడేపల్లిగూడెం పట్టణంలోని 1,2,3 వార్డుల్లో జరిగిన జగనన్న సురక్ష శిబిరాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలందరికీ సమన్యాయం చేసేలా సీఎం జగన్ సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారని, పథకాలను మరింత మెరుగ్గా అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టారన్నారు. దేశ చరిత్రలోనే సురక్ష కార్యక్రమం విప్లవాత్మకమన్నారు. రాష్ట్రంలో ఇంత చక్కగా పాలన అందిస్తుంటే చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ నాశనం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. నాలుగేళ్లుగా సమర్థవంతమైన పాలన అందిస్తూనే చంద్రబాబు కుట్రలను ప్రభుత్వం ఎదుర్కొంటూ ముందుకు సాగుతోందన్నారు. అందరికీ అనుకూల నిర్ణయాలు తీసుకునే ప్రభుత్వానికే ప్రజా మద్దతు ఉంటుందని అన్నారు. ప్రజలంతా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చినతాడేపల్లిలో 637 మందికి, తాడేపల్లిగూడెం పట్టణంలో 590 మందికి సర్టిఫికెట్లు అందించారు. ఆయా కార్యక్రమాల్లో సబ్ కలెక్టర్ సూర్యతేజ, మున్సిపల్ కమిషనర్ శామ్యూల్, మండల ప్రత్యేకాధికారి దుర్గేష్, తహసీల్దార్ వై.దుర్గాకిషోర్, ఎంపీపీ పి.శేషులత, సర్పంచ్ పిచ్చికల రాజారావు, పార్టీ నాయకులు గుండుబోగుల నాగు, కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమగోదావరి జిల్లాలో..
- మొగల్తూరు మండలంలో ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరు ప్రసాదరాజు జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొనగా.. చిట్టవరంలో జేసీ రామసుందరరెడ్డి హాజరయ్యారు.
- పెనుగొండ, ఆచంట, పోడూరు, పెనుమంట్ర మండలాల్లోని ఎనిమిది సచివాలయాల పరిధిలో ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు జగనన్న సురక్ష కార్యక్రమాల్లో పాల్గొన్నారు.
- భీమవరంలోని 25 వార్డు, భీమవరం మండలంలోని తాడేరులో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ హాజరయ్యారు.
- తణుకు మండలం కొమరవరంలో ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, కారుమూరి సునీల్‌కుమార్ పాల్గొన్నారు.
- యలమంచిలి మండలం మేడపాడులో ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ హాజరయ్యారు.
- ఆకివీడు, కాళ్ల, ఉండి మండలాల్లో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు జగనన్న సురక్ష కార్యక్రమాలకు హాజరయ్యారు.
- భీమవరంలోని 1వ వార్డు, వీరవాసరం మండలం తోకలపూడి, ఉండి మండలం పాందువ్వలో కలెక్టర్ ప్రశాంతి పాల్గొన్నారు.

● ఆనందమని'పింఛెన్'



ఏలూరులో కత్తి నాగేశ్వరరావుకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ డి.లక్ష్మి



అత్తిలి మండలం ఈడూరులో వృద్ధుడికి పెన్షన్ అందిస్తున్న దృశ్యం

ఒకటో తారీఖున వేకువజామునే పింఛన్ల పండుగ మొదలైంది. పశ్చిమగోదావరి జిల్లాలో తొలిరోజు శనివారం 88 శాతం వైఎస్సార్ పెన్షన్ కానుకను పంపిణీ చేశారు. 2,16,500 లబ్ధిదారులకు రూ.59.04 కోట్లు అందించాల్సి ఉండగా రూ.52 కోట్లను పంపిణీ చేశారు. - భీమవరం(ప్రకాశం చౌక్)

కొల్లేరు పరిరక్షణ అందరి బాధ్యత



అభయారణ్య పరిధిని పరిశీలిస్తున్న సీసీఎఫ్ శర్వాణన్

కైకలూరు: కొల్లేరు పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా ఉండాలని అటవీశాఖ రాజమండ్రి చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు శర్వాణన్ అన్నారు. కైకలూరు మండలం పందిరిపల్లిగూడెం, పల్లెవాడ గ్రామాల్లో కొల్లేరు ప్రాంతాలు, సర్కారు కాల్వపై వంతెన నిర్మాణాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఇటీవల సర్కారు కాల్వపై నిర్మించిన వంతెనపై వాహనాల రాకపోకల వల్ల పక్షులకు అంతరాయం కలుగుతుందని కాకినాడకు చెందిన వ్యక్తి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో సీసీఎఫ్ వంతెన విస్తీర్ణం, పొడవు, ఎటువంటి వాహనాలు వెళ్లే అవకాశం ఉందనే విషయాలను అటవీ అధికారుల నుంచి తెలుసుకున్నారు. కొల్లేరు అభయారణ్యం పక్షి జాతులకు ఆవాసంగా ఉందని, దానిని పరిరక్షించాలన్నారు. కైకలూరు, ఏలూరు ఫారెస్టు రేంజర్లు జె.శ్రీనివాస్, కుమార్, డీఆర్వో జయప్రకాష్, ఫారెస్టు సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలను ఉపేక్షించం

ఏలూరు రూరల్: కొల్లేరు అభయారణ్యంలో అక్రమ తవ్వకాలను ఉపేక్షించేది లేదని చీఫ్ కన్జర్వేటివ్ ఆఫ్ ఫారెస్ట్ అధికారి శర్వాణన్ హెచ్చరించారు. శనివారం ఆయన కొల్లేరులో అక్రమ తవ్వకాలు పరిశీలించారు. శ్రీపర్రు, మానూరు, మణుగూరు, కొల్లేటికోట, పైడిచింతపాడు, ప్రత్తికోళ్లలంక, కొక్కిరాయిలంక తదితర ప్రాంతాల్లో చెరువులను పరిశీలించారు. అక్రమార్కులపై తీసుకున్న చర్యలపై కైకలూరు, ఏలూరు రేంజర్లు ఎస్వీకే కుమార్, జె.శ్రీనివాస్‌ను వివరణ అడిగారు. అభయారణ్యంలో చెరువులు తవ్వే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అక్రమ తవ్వకాలపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందన్నారు. అక్రమార్కులకు సహకరించే అటవీశాఖ సిబ్బందిపై సైతం చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ రేంజ్ ఆఫీసర్ శ్రీరామారావు ఉన్నారు.

వంద జన్మలెత్తినా సీఎం జగన్ స్థాయిని చేరుకోలేవు

పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ధ్వజం



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం(ప్రకాశం చౌక్): పవన్ కళ్యాణ్ వంద జన్మలెత్తినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థాయికి చేరుకోలేడని భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ స్పష్టం చేశారు. భీమవరం సభలో పవన్ కళ్యాణ్ సీఎం జగన్‌ని ఉద్దేశించి ఆయన చేయి చూపుతూ మాట్లాడతారంటూ ఇమిటేట్ చేసే ప్రయత్నం చేశాడని, ముఖ్యమంత్రిని ఇమిటేట్ చేసే అర్హత పవన్‌కు లేదని చెప్పారు. భీమవరం సభలో పవన్‌కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జనసేన జనాన్ని మోసగించే ప్యాకేజీ పార్టీ అని, చంద్రబాబు, పవన్ తోడు దొంగలని విమర్శించారు.

బాబులో భగత్‌సింగ్‌ను చూస్తున్నావా..

రైతులు, మహిళలు, యువతను, అన్నిరంగాల వారిని దారుణంగా మోసం చేసిన చంద్రబాబు నీకు ఎలా కనిపిస్తున్నాడు.. ఒక గాంధీజీలా.. ఒక పుచ్చలపల్లి సుందరయ్యలా.. ఒక తరిమెల నాగిరెడ్డిలా కనిపిస్తున్నాడా అని ఎమ్మెల్యే గ్రంధి పవన్‌నుద్దేశించి ప్రశ్నించారు. చంద్రబాబును ఒక భగత్‌సింగ్ అని చెప్పే దమ్ము పవన్ కళ్యాణ్‌కు ఉందా అని నిలదీశారు. బాబుతో కలిసి పవన్ ఎందుకు ప్రయాణిస్తున్నాడనే విషయంపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలన్నారు. కనీసం జనసేన కేడర్‌కైనా సమాధానం చెప్పాలన్నారు. మీరిద్దరూ తోడు దొంగలు.. ఇప్పటికైనా మీ ముసుగులు తొలగించండి అని ధ్వజమెత్తారు.

99.5 శాతం అమలైన మేనిఫెస్టో హామీలు

సీఎం జగన్ వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావిస్తున్నారని గ్రంధి చెప్పారు. దానిని చిత్తశుద్ధిగా అమలు చేస్తూ ఇప్పటికే 99.5 శాతం హామీలు నెరవేర్చారన్నారు.

పేదలకు మేలు జరిగితే పవన్‌కు ఉక్రోషమా..

రాష్ట్రంలో పేదలకు మేలు జరిగితే పవన్‌కు ఉక్రోషం, కడుపు మంట ఎందుకని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ప్రజలు కూడా ప్రతిపక్షాల ఆపసోపాలపై ఇదే అభిప్రాయంతో ఉన్నారన్నారు. వృద్ధులకు పింఛన్లు ఠంచనుగా వస్తుంటే తట్టుకోలేరు.. మహిళలకు చేయూత, చేదోడు, ఆసరా, అమ్మఒడి వస్తుంటే ఈ బాబు, పవన్‌లు జీర్ణించుకోలేకపోతున్నారు.. పేదలకు ఇళ్ల స్థలాలిస్తుంటే కోర్టులకెళ్లి మరీ అడ్డంపడతారు.. దీనిని బట్టి ప్రతిపక్షంగా వీరు ఏవిధంగా వ్యవహరిస్తున్నారనేది ప్రజలు అర్థం చేసుకుంటున్నారని చెప్పారు.

మీరంతా కుమ్మక్కై అమరావతిలో భూదందా నడపలేదా..

మీరంతా కుమ్మక్కై అమరావతి ప్రాంతంలోనే రాజధాని వస్తుందని లీకులిచ్చి ఒక సామాజిక వర్గానికి కొమ్ముకాసి భూముల దందా నడపలేదా అని పవన్‌ను గ్రంధి ప్రశ్నించారు. అమరావతి ప్రాంతంలో తమ ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలిస్తుంటే చంద్రబాబు తన తాబేదారులతో కోర్టుల్లో కేసులు వేయించాడని.. అప్పుడు పవన్ ఎందుకు ప్రశ్నించలేదని మండిపడ్డారు.

బాబు మోసాలపై ప్రశ్నించరా..

చంద్రబాబు 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్నప్పుడు రైతులకు సంబంధించి రుణమాఫీ చేస్తానని చేయకుండా మోసం చేశాడని.. ప్రశ్నించడానికే రాజకీయాల్లోకి వచ్చానన్న నీ నోరు అప్పుడు ఎందుకు పడిపోయిందని పవన్‌ను గ్రంధి ప్రశ్నించారు. ఈ రోజు రైతులు గిట్టుబాటు ధరల విషయంలోను, ధాన్యం కొనుగోళ్లలోనూ ఆనందంగా ఉన్నారని చెప్పారు.

మద్య నిషేధంపై వ్యాఖ్యలు.. పవన్ అజ్ఞానానికి నిదర్శనం..

మద్య నిషేధంపై పవన్ వ్యాఖ్యలను గ్రంధి తప్పుబట్టారు. జగన్ అధికారంలోకి రాగానే ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో నుంచి మద్యం దుకాణాలను ప్రభుత్వానికి అప్పగించారని తెలిపారు. బెల్టు దుకాణాలను రద్దు చేశారని, ఇవన్నీ తెలియకపోవడం పవన్ అజ్ఞానానికి నిదర్శనమని ఎమ్మెల్యే చెప్పారు.

ఆలయ భూముల్లో ఆక్రమణలు తొలగిస్తాం

ఆగిరిపల్లి(నూజివీడు): ఆగిరిపల్లిలోని శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి ఆలయ భూముల్లో నిర్మించిన ఆక్రమిత కట్టడాలను తొలగించాలని ఎండోమెంట్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పు ప్రకారం చర్యలు తీసుకుంటున్నట్టు దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రంగారావు తెలిపారు. స్థానిక ఆలయ ఈఓ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్యాలయంలో అమ్మవారిగూడెం రోడ్డులోని పార్వతీ తిప్పపై ఆలయ భూముల్లో శాశ్వత , తాత్కాలిక నిర్మాణాలకు సంబంధించి 21 మందిపై ట్రిబ్యునల్‌లో ఫిర్యాదు చేయగా, గత నెల 26న ఆక్రమణలను తొలగించాల్సిందిగా తీర్పు వచ్చిందన్నారు. ఈ మేరకు వారం రోజుల్లో నోటీసులు జారీ చేస్తామన్నారు. అలాగే మరికొందరు అక్రమ నిర్మాణాలు చేపట్టిన దృష్ట్యా వారిని కూడా గుర్తించి నివేదికను ట్రిబ్యునల్‌కు పంపుతామన్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ఆక్రమితదారుల నుంచి వచ్చే ప్రతిపాదనలను స్వీకరించి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. అనంతరం పార్వతీ తిప్పపై అక్రమ కట్టడాలను పరిశీలించి, ఆక్రమణదారులతో మాట్లాడారు. ఈఓ నాగినేని భవాని పాల్గొన్నారు.

రైలు నుంచి జారి పడి మహిళ మృతి


గుర్తు తెలియని మహిళ మృతదేహం

తణుకు: ఆరవల్లి–భీమవరం రైల్వే స్టేషన్ల మధ్య రైలు పట్టాలు పక్కనే గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు వచ్చిన సమాచారంతో తణుకు రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గుర్తించారు. సుమారు 60 సంవత్సరాలు వయసు కలిగిన మహిళ ఎరుపురంగు సిల్కు, పచ్చరంగు అంచుతో చీర ధరించి ఉన్నట్లు తెలిపారు. రైలు నుంచి జారిపడి మృతి చెందినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. తణుకు ఇన్‌చార్జి ఎస్సై పీటీవీ రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సమాచారం తెలిసిన వారు 95738 91737 ఫోన్ నంబర్‌కు సమాచారం అందించాలని తణుకు రైల్వే హెచ్‌సీ పీఎస్ఆర్ ప్రసాద్ కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పాలకోడేరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలై చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై నాళం శ్రీనివాసరావు శనివారం చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. గొల్లలకోడేరు నుంచి ఉప్పరగూడెంకు ద్విచక్ర వాహనంపై సీహెచ్ శ్రీను, కే.శ్రీను, సీహెచ్ మాణిక్యాలరావు గత నెల 28న వెళుతుండగా ఎదురుగా వచ్చిన టిప్పర్ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయమైన సీహెచ్ శ్రీనును చికిత్స నిమిత్తం భీమవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అదే రోజు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీను శుక్రవారం రాత్రి మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

భీమవరంలో అభివృద్ధి.. ప్రజలకు తెలుసు

- నాలుగేళ్ల మూడు నెలల్లో సంక్షేమ పథకాల ద్వారా రూ.1220 కోట్ల లబ్ధి
- 160 ఎకరాల విస్తీర్ణంలో 7 వేల మందికి ఇళ్ల స్థలాల పట్టాలు
- రూ.33 కోట్లతో వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి శ్రీకారం
- ఎమ్మెల్యే గ్రంధి సొంత సొమ్ము రూ.16 కోట్లతో ఆసుపత్రికి స్థలం విరాళం
- అవగాహన లేకుండా అడ్డగోలుగా మాట్లాడిన జనసేన అధినేత పవన్


భీమవరం మండలం తాడేరులో శరవేగంగా జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: భీమవరంలో గడిచిన నాలుగేళ్లలో ఏం అభివృద్ధి జరిగిందో ప్రతిపక్షాలకు తెలియదు. కానీ భీమవరం ఓటర్లకు తెలుసు. సంక్షేమ ఫలాలు పొందిన ప్రతి గడపకు తెలుసు. నియోజకవర్గంలో అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు పెద్ద ఎత్తున అమలువుతున్నాయి. వందల కోట్ల వ్యయంతో నియోజకవర్గం రూపురేఖలు మారేలాగా సమగ్ర మౌలిక వసతులతో కూడిన సుస్థిర అభివృద్ధి ఒకవైపు.. ప్రజల జీవనప్రమాణాలు, ఆర్థిక స్థితి మెరుగుపరిచేలా సంక్షేమ పథకాల ద్వారా చేయూతతో మరోవైపు భీమవరం గణనీయంగా వృద్ధి చెందుతోంది. 2019కి ముందు భీమవరానికి, ప్రస్తుతం ఉన్న భీమవరానికి పూర్తి వ్యత్యాసం ఉన్నది అనేది అందరూ అంగీకరించే నిజం. నూతన పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కేంద్రంగా ఉన్న భీమవరంలో కలెక్టర్ మొదలుకుని అన్ని విభాగాల్లో ఉన్నతాధికారులు, సిబ్బందితో భీమవరం నిత్యం సందడిగా మారింది. ఇదంతా గడిచిన నాలుగేళ్ళ మూడు నెలల్లో జరిగిన సంక్షేమ పాలనలో అభివృద్ధి

అడ్డగోలుగా ఆరోపణలు

భీమవరంలో నాలుగు రోజులు పాటు జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ పర్యటించారు. మూడు రోజుల పాటు రకరకాలు సమావేశాలతో పాటు శుక్రవారం బహిరంగ సభ నిర్వహించి భీమవరంలో అభివృద్ధి శూన్యం, ఆసుపత్రి మొదలుకుని ఏ ఒక్క పని పూర్తి కాలేదు. భీమవరం గురించి నాకు తెలిసినంతా ఎవరికి తెలియదని అడ్డగోలుగా మాట్లాడటంతో ప్రజల్లో ఆసహనం వ్యక్తమవుతోంది. అలాగే వంద పడకల ఆసుపత్రికి నాబార్డు నుంచి రూ.10 కోట్లు నిధులు విడుదలైనా దాన్ని వినియోగించుకోలేకపోతున్నారని, జల జీవన్ మిషన్‌తో అభివృద్ధి చేసుకోలేకపోతున్నారని, ఇక భీమవరాన్ని పాలకులు పట్టించుకోవడం లేదని ఇష్టానుసారంగా మాట్లాడారు. అయితే వాస్తవానికి పూర్తిగా భిన్నంగా ఉంది. ప్రణాళికాబద్ధంగా ప్రాధాన్యతా క్రమంలో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. అమ్మ ఒడి, రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా, పెన్షన్ కానుక, విద్యా దీవెన, చేయూత, జలజీవన్‌తో పాటు ఇతర నవరత్నాల పథకాల ద్వారా రూ.1,200 కోట్ల పైచిలుకు వ్యక్తిగత లబ్ధి, వేలాది కుటుంబాలకు అందింది. ఇక 180 ఎకరాల్లో జగనన్న కాలనీలను నిర్మించి 7 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వడంతో పాటు అనేక చోట్ల ఇళ్ల నిర్మాణం ముమ్మరంగా సాగుతోంది.

నాలుగేళ్లలో జరిగిన అభివృద్ధి ఇదే..

- మూడు ప్రధాన బ్రిడ్జిలకు అప్రోచ్ రోడ్ల కోసం రూ.36 కోట్ల వ్యయంతో రహదారులను నిర్మించనున్నారు. ఇప్పటికే నిధులు మంజూరై టెండర్ దశకు చేరుకుంది.
- శిథిలావస్థలో ఉన్న తాడేరు బ్రిడ్జిని రూ.2.30 కోట్లతో నిర్మిస్తున్నారు. పనులు కూడా పురోగతిలో ఉన్నాయి.
- భీమవరంలో 160 ఎకరాల భూమిని సేకరించి 7 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చి అదనంగా మరికొంత మందికి ఇవ్వడానికి కూడా ఏర్పాట్లు చేశారు.
- మున్సిపాల్టీలో నాలుగేళ్లల్లో రూ.62 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులు, ఇతర పనులు పూర్తయ్యాయి. కొత్తగా నియోజకవర్గంలో జలజీవన్ మిషన్ ద్వారా రూ.42 కోట్లు, అమృత్ పథకం ద్వారా భీమవరం మున్సిపాలిటీలో మరో రూ.42 కోట్లతో మంచినీటి ప్రాజెక్టుకు నిధులు మంజూరయ్యాయి.
- ఇక ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో పట్టణంలో ఐదు చోట్ల రైల్వే అండర్ టన్నల్స్‌ను నిర్మించారు. అది కూడా అవసరమైన చోట్ల డబుల్ లైన్ టన్నెల్స్ నిర్మించి కంటైనర్లు వెళ్లే వీలుగా ఏర్పాట్లు చేయించారు.
- అలాగే రైల్వేస్టేషన్ రెండో ప్లాట్‌ఫాం వరకు మున్సిపాల్టీ ద్వారా రోడ్డు నిర్మాణం, ఇండోర్ సబ్‌స్టేషన్ నిర్మాణం, ఇలా పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు కొనసాగుతూనే ఉన్నాయి.

రూ.16 కోట్లతో భూమి కొని విరాళంగా ఇచ్చిన గ్రంధి

50 పడకల ఆసుపత్రి నిర్మాణం కోసమని తొలుత ప్రతిపాదనలు సిద్ధం చేసి తరువాత సమగ్ర స్థాయిలో ఆసుపత్రి ఉంటే బాగుంటుందని భావించి రూ.16 కోట్ల వ్యయంతో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సొంత సొమ్ముతో నాలుగు ఎకరాల భూమిని కొనుగోలు చేసి రాష్ట్ర గవర్నర్ పేరుతో ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ చేయించి ఆ స్థలంలో రూ.33 కోట్ల వ్యయంతో ఆసుపత్రి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మొదట రూ.10 కోట్ల వ్యయంతో పనులు చురుగ్గా సాగుతున్నాయి. మరో రూ.23 కోట్ల నిధులు మంజూరుకు ముఖ్యమంత్రి అంగీకారం తెలపడంతో పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ఇవేవి జనసేనానికి నామమాత్రంగానైనా తెలియని విషయాలు. ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదవడం మినహా భీమవరంపై అతనికి ప్రాథమిక అవగాహన కూడా శూన్యం. ఇక డంపింగ్ యార్డ్ కోసం 27.5 ఎకరాల భూమిని ఎమ్మెల్యే నేతృత్వంలో సేకరించారు. ప్రతిపక్షాల కడుపుమంటతో కోర్టులకు వెళ్లి అనేక అడ్డంకులు సృష్టించడంతో అది పెండింగ్‌లో పడింది. మరో 6.50 ఎకరాల భూమిని కంపోస్టు యార్డుకు తీసుకుని కేంద్రం నుంచి అనుమతులు కూడా తీసుకున్నారు. ఇదంతా జనసేనానికి తెలియదు.


భీమవరంలో నిర్మాణంలో ఉన్న వంద పడకల ఆసుపత్రి




తాడేపల్లిగూడెం రూరల్ : కొమ్ముగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

ఆకివీడు : చినకాపవరం శివారు రామయ్యగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.రమేష్ శనివారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు, అర్చకులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ ఏఈఓ పి.నటరాజారావు స్వామివారి మెమెంటో, ప్రసాదాలను అందజేశారు. ఆయన వెంట భీమడోలు కోర్టు న్యాయమూర్తి ఆదిత్య రిషిక్, తహసీల్దార్ సతీష్, ఎస్సై టి.సుధీర్ తదితరులున్నారు.


శ్రీవారి ఆలయంలో హైకోర్టు న్యాయమూర్తి రమేష్‌కు స్వామివారి మెమెంటో అందజేస్తున్న ఆలయ ఏఈఓ నటరాజారావు


శ్రీవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న సాయిప్రసాద్

శ్రీవారిని దర్శించిన ఈసీ జాయింట్ సెక్రటరీ

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ జాయింట్ సెక్రటరీ జీవీ సాయిప్రసాద్ శనివారం సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు దేవస్థానం అధికారులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో పండితులు ఆయనకు వేద ఆశీర్వచనాన్ని పలికి, శ్రీవారి మెమెంటో, ప్రసాదాలను అందజేశారు. ఆయన వెంట ద్వారకాతిరుమల తహసీల్దార్ పొట్టూరి సతీష్ తదితరులున్నారు.

తెలంగాణ మద్యం స్వాధీనం


సుంకొల్లులో స్వాధీనం చేసుకున్న తెలంగాణ మద్యం సీసాలు

నూజివీడు: సుంకొల్లులో మహిళ నుంచి 105 తెలంగాణ మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్సై తలారి రామకృష్ణ చెప్పారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తమకు అందిన సమాచారం మేరకు రూరల్ ఎస్సై తన సిబ్బందితో శనివారం గ్రామంలో తనిఖీలు నిర్వహించారు. కొనకళ్ల సీతమ్మ అనే వృద్ధురాలి ఇంటి వద్ద 105 తెలంగాణ మద్యం సీసాలను ఉండటాన్ని గమనించి వెంటనే వాటిని స్వాధీనం చేసుకుని వృద్ధురాలిని అదుపులోకి తీసుకున్నారు. వీటి విలువ రూ.17వేలు ఉంటుందని, నిందితురాలిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి అరెస్టు, 20 లీటర్ల సారా స్వాధీనం

ఆగిరిపల్లి (నూజివీడు): ఆగిరిపల్లి మండలం శోభనాపురంలో ఎస్సై నంబూరి చంటిబాబు తన సిబ్బందితో శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గ్రామంలో సారా తయారు చేస్తున్న ఎస్‌ఏ పేటకు చెందిన పామర్తి పంగిడయ్యను అరెస్టు చేసి, అతని నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. అలాగే 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. నిందతుడిని నూజివీడు కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

గురుకుల కళాశాలను తనిఖీ చేసిన హైకోర్టు జడ్జి

ద్వారకాతిరుమల : స్థానిక వసంత్‌నగర్ కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.రమేష్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలకు విచ్చేసిన ఆయన ముందుగా తరగతి గదులను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. కళాశాలలో అందుతున్న విద్య, వసతి సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం వంటశాలను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అలాగే హాస్టల్‌లోని వసతి గదులను, పారిశుధ్యాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట జిల్లా జడ్జి పురుషోత్తం, భీమడోలు కోర్టు న్యాయమూర్తి ఆదిత్య రిషిక్, స్థానిక తహసీల్దార్ పొట్టూరి సతీష్, ఎస్సై టి.సుధీర్ తదితరులున్నారు.


గురుకుల కళాశాలలో వండిన ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రమేష్

చిన్న వెంకన్న క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

ద్వారకాతిరుమల: చిన్నతిరుపతి క్షేత్రానికి శనివారం భక్తులు పోటెత్తారు. శ్రీవారికి ప్రీతికరమైన రోజు కావడంతో వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రాక మొదలవడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. వైకుంఠం క్యూకాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, అనివేటి మండపంతో పాటు తూర్పురాజగోపుర ప్రాంతం, కేశఖండనశాల ఇతర విభాగాలు భక్తులతో కిక్కిరిశాయి. ఆలయ ఆవరణలో పలు భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు చూపరులను అలరించాయి. సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది.



వరదలకు ముందే సన్నద్ధం

కుక్కునూరు: గోదావరి వరదల వల్ల తలెత్తే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రెవెన్యూ యంత్రాంగం ముందస్తు సన్నాహాలు చేస్తోంది. గత ఏడాది జూలైలో భద్రాచలం వద్ద రికార్డు స్థాయిలో 71.3 అడుగులు నీటిమట్టం నమోదై ఒక్కసారిగా వరద రావడంతో పునరావాస కేంద్రాలలో తలదాచుకున్న నిర్వాసితులకు నిత్యావసరాలు పంపిణీలో తీవ్ర జాప్యం జరిగి ఇబ్బందులు పడ్డారు. దీంతో ఈ ఏడాది అటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే మండలంలో 21 సురక్షిత ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాలలో బియ్యం, కంది పప్పు వంటి నిత్యావసరాలను చేరవేశారు. ఇంకా చేపట్టాల్సిన పనులపై ప్రణాళికను సిద్ధం చేసుకుంటున్నట్టు తహసీల్దార్ డీ ఎల్ ప్రమద్వర చెప్పారు.


గత ఏడాది వరదకు మునిగిన కుక్కునూరు గ్రామం (ఫైల్)

క్లుప్తంగా

వైద్యులు దేవుళ్లతో సమానం



వాకర్స్ ఆధ్వర్యంలో డాక్టర్లను సన్మానిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): డాక్టర్స్ డే సందర్భంగా పట్టణంలో శనివారం వివిధ స్వచ్ఛంద సేవా సంస్థలు ఆధ్వర్యంలో వైద్యులకు ఘన సత్కారాలు నిర్వహించారు. ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాకర్స్ భవనంలో అధ్యక్షుడు కేవీ చలం అధ్యక్షతన డాక్టర్లు తానేటి శ్రీనివాసరావు, మారిశెట్టి హారిక, కంచర్ల లక్ష్మీ నరసింహంలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పి.కుమారస్వామి, పీవీ పరమాత్మ, మాకా శ్రీనివాసరావు, కె.నరసింహమూర్తి, ప్రవా శ్రీనివాస్, బి.రాజేంద్ర, రాగిరెడ్డి నాగ వర ప్రసాద్, బాకా వెంకటేశ్వర రావు, దూలం నాగరాజు, వనచర్ల నాగేంద్ర ప్రసాద్, ఏఆర్‌కే సత్యనారాయణ, సారథి, వాకర్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తణుకు టౌన్: జాతీయ డాక్టర్ దినోత్సవం సందర్భంగా శనివారం తణుకు లయన్స్ క్లబ్, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్యులను సత్కరించారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ, కోశాధికారి ఆర్జి భాస్కరరావు, సంయుక్త కార్యదర్శి ఎస్‌రామకృష్ణారావు, శనివారపు చలపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'మాగంటి'లో అమ్మ ఒడి కార్యక్రమం

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ స్థాయిలో ఆదివారం ఉదయం 11 గంటలకు స్థానిక హౌసింగ్ బోర్డు సమీపంలోని మాగంటి కళ్యాణ మండపంలో అమ్మ ఒడి కార్యక్రమం నిర్వహించనున్నట్టు మంత్రి క్యాంపు కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు వెంకట్రామన్నగూడెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందన్నారు. ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఈ కార్యక్రమాల్లో పాల్గొంటారని, అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొనాలని క్యాంపు కార్యాలయ ప్రతినిధులు కోరారు.


విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న మానసిక వైద్యుడు శ్రీనివాస్

ఇరగవరం: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మానసిక వైద్యుడు కె.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని తూర్పు విప్పర్రు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మత్తు పదార్థాల వచ్చే అనార్థాలను విద్యార్థులకు వివరించారు. తల్లిదండ్రులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అరుణాచల గిరి ప్రదక్షిణకు బస్సు యాత్ర ప్రారంభం



బస్సు యాత్ర ప్రారంభం సందర్భంగా మాట్లాడుతున్న డిపో మేనేజర్ సత్యనారాయణమూర్తి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని తాడేపల్లిగూడెం బస్ స్టేషన్ నుంచి శనివారం రాత్రి అరుణాచల గిరి ప్రదక్షిణ ఆధ్యాత్మిక బస్సు యాత్ర ట్రిప్ ప్రారంభమైంది. డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి యాత్రను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 2 + 2 వీడియో కోచ్ సూపర్ లగ్జరీ ప్రత్యేక సర్వీస్ నాలుగు రోజులు యాత్రలో భాగంగా శ్రీ కళహస్తీశ్వర స్వామి వారి దర్శనం, కాణిపాకం లోని వరసిద్ధి వినాయక స్వామి దర్శనం, శ్రీపురం శ్రీ లక్ష్మీదేవి అమ్మవారి గోల్డెన్ టెంపుల దర్శనం, అరుణాచలం చేరుకొని, పవిత్ర గురు పౌర్ణమి రోజున గిరి ప్రదక్షిణ చేసుకొని అనంతరం అరుణాచలేశ్వర స్వామిని దర్శనం చేసుకొంటారని తెలిపారు.

ముగిసిన ఉపవాస ప్రార్థనలు

పెంటపాడు: అక్షయమైన ఆత్మకు జీవాహారం ఎంతో అవసరమని ప్రవక్తిని కొమ్మిశెట్టి అమ్మాజీ పేర్కొన్నారు. పడాల వాక్యజ్యోతి మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో రెండు రోజుల నుంచి పడాలలో జరుగుతున్న ఉపవాస ప్రార్థనలు శనివారం ముగించారు. ఈ సందర్భంగా శుక్ర, శనివారాల్లో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో అమ్మాజీ దేవుని వాక్యం భోదించి విశ్వాసులకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దేవుని సన్నిధిలో గడపడం, ప్రార్థనలు చేయడం ద్వారా ఆధ్యాత్మిక శక్తి పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పాస్టర్ల సంఘ నాయకులు కొమ్మిశెట్టి జాజిరాజు, పాస్టర్ ఘనరాజు పాల్గొన్నారు.

సంతృప్తిగా పథకాలు అందించడమే లక్ష్యం

ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్



తణుకు: జగనన్న సురక్ష శిబిరంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్, యువనేత కారుమూరి సునీల్‌కుమార్ తదితరులు

తణుకు అర్బన్: అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాత్ అన్నారు. తణుకు హౌసింగ్ బోర్డు కాలనీలో శనివారం ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజల అవసరాలు ముందే తెలుసుకుని వారికి సంక్షేమాన్ని అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని అన్నారు. యువనేత కారుమూరి సునీల్‌కుమార్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సచివాలయ వ్యవస్థ ద్వారా 11 రకాల సేవలకు సంబంధించిన ధ్రువపత్రాలు ఉచితంగా ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. ఇందులో భాగంగా ఆధార్ కార్డులో ఉన్న సవరణలతోపాటు జనన, మరణ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందుబాటులోకి తీసుకువచ్చారని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి వారికి అవసరమైన ధ్రువపత్రాలకు సంబంధించి వివరాలను సేకరించి శనివారం సదరు ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ డీఈఈ కొవ్వూరి ఈశ్వరరెడ్డి, ఏఈ రామకిషోర్, జేఎస్సీ పట్టణ కన్వీనర్ యిండుగపల్లి బలరామకృష్ణ, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, సుద్దుల పాండు, ములగాల శ్రీనివాస్, పైబోయిన ఏసు, మణికంఠరెడ్డి, జాకబ్ బాబు, నత్తా కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరి సంపూర్ణ లబ్ధి కోసం జగనన్న సురక్ష

ఇరగవరం: ప్రజలందరికి సంపూర్ణ లబ్ధి చేకూర్చడానికే జగనన్న సురక్ష కార్యక్రమం అని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, కారుమూరి సునీల్ కుమార్ అన్నారు. శనివారం ఇరగవరం మండలం సురంపూడి గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాలన్నదే జగనన్న ఉద్దేశ్యమన్నారు. అందుకే జగనన్న సురక్ష కార్యక్రమం పేరుతో సమస్యలను జల్లెడవేసి పడుతున్నట్టు తెలిపారు. ప్రభుత్వ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా డ్వామా పీడీ ఎస్‌టీవీ రాజేశ్వర రావు, జెడ్పీటీసీ సభ్యులు పంపన అంజిబాబు, ఎంపీపీ అలివేలు మంగ తాయారు, పార్టీ మండల అధ్యక్షుడు దుర్గా ప్రసాద్, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, ఎరపీపీ వెలగల సాయిబాబా రెడ్డి, సర్పంచ్ కఠారి చంద్రమణి, నాయకులు కఠారి రాంబాబు, జాలి సుబ్బరావు, అధికారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పెంటపాడు: అలంపురం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ అఖిల

జగనన్న సురక్ష ద్వారా ప్రజాసంక్షేమం

పెంటపాడు: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష ద్వారా ప్రజా సమస్యలు తక్షణం పరిష్కరించాలని, తద్వారా ప్రజా సంక్షేమం సాధ్యమని ట్రైనీ కలెక్టర్ అఖిల, డీపీవో జీవీకే మల్లికార్జునరావులు పేర్కొన్నారు. పెంటపాడు మండలంలోని అలంపురం-1, ఆకుతీగపాడు గ్రామాలలో జగనన్న సురక్ష కార్యక్రమానికి సంబంధించి ఆయా సచివాలయాల వద్ద గ్రామ సభలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల్లో జరిగిన సమావేశంలో ట్రైనీ కలెక్టర్ అఖిల, డీపీవో, మండల ప్రత్యేకాధికారి జీవీకే మల్లికార్జునరావులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జీవీ శేషగిరిరావు, ఎంపీడీవో సీహెచ్ బాలాజీ, ఈవోపీఆర్డీ ప్రసాద్, ఆర్ఐ కనకదుర్గ, పార్టీ నాయకులు, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అత్తిలి :మండలం కె సముద్రపుగట్టులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్

జగనన్న సురక్ష ద్వారా ప్రజల ముంగిటకే ఉచిత పౌరసేవలు

అత్తిలి: సంక్షేమ పథకాలు, ప్రజా సమస్యలు సంతృప్తస్థాయిలో పరిష్కరించడమే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ అన్నారు. అత్తిలి మండలం కె సముద్రపుగట్టు గట్టు గ్రామంలో శనివారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్సీ రవీంద్రనాథ్, కారుమూరి సునీల్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, సర్పంచ్ బండి వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు అద్దంకి శ్రీను, ఎమ్మెల్యో వెలగల విజయభాస్కరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శింగంశెట్టి శ్రీనివాస్, మద్దాల శ్రీనివాస్, కముజు శ్రీనివాస్, గారపాటి నాగరాజు, కోరుకొల్లు వెంకట్రావు, బుడితి సుజన్‌కుమార్, బుంగా పద్మారావు, కంకటాల సతీష్, బండి సత్యనారాయణ, వూడిమూడి ప్రసాద్, తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు, ఈవోఆర్డీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈడూరు గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను స్థానిక ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు అందజేసారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

తణుకు టౌన్: దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా రాష్ట్రంలో ప్రజల గడప వద్దకే సంక్షేమ పథకాలు అందించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన అందిస్తున్నారని ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ చెప్పారు. తణుకు రూరల్ మండలం కొమరవరం గ్రామంలో జగనన్న సురక్ష గ్రామ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కరిబండి రాజేష్, సొసైటీ అధ్యక్షుడు నిమ్మకాయల సురేష్ బాబు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యలో ఏపీని నంబర్‌వన్‌గా నిలపాలనేది సీఎం జగన్ ధ్యేయం

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



అమ్మ ఒడి చెక్కును అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: విద్యలో ఆంధ్రప్రదేశ్‌ను నంబర్ వన్ స్థానంలో నిలపాలనేది సీఎం జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. శనివారం తాడేపల్లిగూడెం మండలం కొమ్ముగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమ్మ ఒడి నాల్గవ విడత పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఎంఈవో వి.హనుమ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 42లక్షల 61వేల 965మంది తల్లుల ఖాతాలకు అమ్మ ఒడి నాల్గవ విడతగా రూ.6392.94కోట్లను జమ చేశారన్నారు. ఈ ఏడాది రూ.13వేలను తల్లుల ఖాతాలకు బట్వాడా చేశారన్నారు. పాఠశాల, మరుగుదొడ్ల నిర్వహణ కింద రూ.2వేలను ప్రభుత్వం పాఠశాలలకు అందజేస్తుందన్నారు. విద్యార్థులు ఆనందంగా, ఉత్సాహంగా చదువుకోవడానికి పాఠశాలలకు నాడు–నేడులో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని తీసుకొస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను చూస్తుంటే ఎంతో ముచ్చటేస్తుందన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మాట్లాడటం విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పునకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ నూతన విద్యావిధానాన్ని దత్తత తీసుకున్న మొట్ట మొదటి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని కొనియాడారు. 14 ఏళ్ల చంద్రబాబు పాలనలో ఏనాడు ప్రభుత్వ విద్యపై దృష్టి పెట్టలేదన్నారు. ప్రభుత్వ పాఠశాలలను మూసివేయాలని, కార్పొరేట్లకు విద్యను దారాదత్తం చేయాలనే ఆలోచనే తప్ప మరో ఆలోచన లేదన్నారు. విద్యా వ్యవస్థలో మార్పు తీసుకొచ్చిన సీఎం జగన్ ఒక గొప్ప సంఘ సంస్కర్త అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పొనుకుమాటి శేషులత, వైస్ ఎంపీపీలు సూర్నని రామకృష్ణ, కట్టా రంగబాబు, ఎమ్పీటీసీలు మార్లపూడి సుబ్బారావు, జంపెల్లి సత్యవతి, బుర్ల సుబ్బలక్ష్మి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ముప్పిడి పెద్దబ్బులు రెడ్డి, దిశా ఫౌండేషన్ కోశాధికారి కొల్లా విజయలక్ష్మి, సొసైటీ చైర్మన్ వెలిశెట్టి నరేంద్ర కుమార్, పరిమి తులసీదాస్, జడ్డు హరిబాబు, చిక్కాల సత్యనారాయణ, సర్పంచ్‌లు తాడేపల్లి బేబి, రాజమహేంద్రవరపు లక్ష్మణరావు, నాయకులు చిగురుపాటి పార్వతి, మండల ప్రత్యేకాధికారి దుర్గేష్, ఎంపీడీవో విశ్వనాథం, ఈవోపీఆర్డీ ఎం.వెంకటేష్, ఏపీఎం జీవీకేడీఎం.లక్ష్మి, ఏడీఏ పి.మురళీకృష్ణ, పీఆర్ డీఈ వేణుగోపాల్, ఏవో ఆర్ఎస్.ప్రసాద్, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

రేషన్ డిపోల ద్వారా గోధుమ పిండి ప్యాకెట్ల పంపిణీ



తణుకులో మహిళలకు గోధుమ పిండి ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్, కారుమూరి సునీల్

తణుకు అర్బన్: చౌకడిపోల ద్వారా లబ్ధిదారులకు గోధుమ పిండి అందించడం అభినందనీయమని ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ అన్నారు. తణుకు 27వవార్డులో శనివారం నిర్వహించిన గోధుమ పిండి పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో ఎప్పుడో గోధుమలను రేషన్ డిపోల ద్వారా ప్రజలకు ప్రభుత్వం అందించేదని కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో నాణ్యమైన గోధుమ పిండి ప్యాకెట్‌లను అందించే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. డయాబెటీస్ రోగులతోపాటు అధికశాతం ప్రజానీకం చపాతి వంటి ఆహార పదార్థాలను భుజించేందుకు ఇష్టపడుతున్నారని ఈ క్రమంలో గోధుమ పిండి ప్యాకెట్‌లను చౌకడిపోల ద్వారా అందించడాన్ని ప్రజానీకం కూడా స్వాగతిస్తున్నారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, యువనేత కారుమూరి సునీల్‌కుమార్, రేషన్ డీలర్ల తణుకు సంఘ గౌరవ అధ్యక్షుడు పూడి శంకరం, అధ్యక్షుడు రవికుమార్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, జేసీఎస్ పట్టణ కన్వీనర్ యిండుగపల్లి బలరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ రక్షణ కోసం న్యాయవాదులు పోరాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సుంకర రాజేంద్రప్రసాద్

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాజ్యాంగం రక్షణ కోసం న్యాయవాదులు పోరాడాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర అధ్యక్షుడు సుంకర రాజేంద్ర ప్రసాద్ అన్నారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఉభయ జిల్లాల మహాసభ శనివారం తాడేపల్లిగూడెం పట్టణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో వి.శైలజ అధ్యక్షతన జరిగింది. ఎస్.రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో రాజ్యాంగంపై దాడి జరుగుతుందన్నారు. రాజ్యాంగ రక్షణ కోసం కృషి చేద్దామన్నారు. న్యాయవాద వృత్తితోపాటు న్యాయవాదులు సామాజిక బాధ్యత కలిగి ఉండాలన్నారు. తాడేపల్లిగూడెం కోర్టు సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు మాట్లాడుతూ జూనియర్ న్యాయవాదులు వృత్తిలో నైపుణ్యాన్ని పొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్జిలు ఎస్.సూర్యకిరణ్ శ్రీ, డి.అరుంధతి, ఈ.అన్నమణి, న్యాయవాదులు దిగుపాటి రాజగోపాలన్, కామన మునిస్వామి, పి.వేణుగోపాల చౌదరి, ఎస్ఎన్‌టీ బాబా, యడవల్లి మణికంఠ తేజ, కట్టా సత్యనారాయణ, కౌరు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- కొమ్ముగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం



కొమ్ముగూడెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు

తాడేపల్లిగూడెం రూరల్: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు, సమస్యల పరిష్కారానికి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు పాలనలో రైతులు అధమ స్థానంలోకి దిగజారిపోయారన్నారు. 2004 తర్వాత వైఎస్సార్ వచ్చి ఉచిత విద్యుత్‌ను అందించి వ్యవసాయాన్ని పండుగ చేశారన్నారు. తద్వారా భూముల విలువ పెరిగిందన్నారు. ఈ ఘనత వైఎస్సార్‌కే దక్కుతుందన్నారు. చంద్రబాబు వల్ల ఏ రైతైనా బాగుపడ్డారా ? అని ప్రశ్నించారు. రూ.86 వేల కోట్లు రైతు రుణమాఫీ చేస్తానని నమ్మ బలికాడన్నారు. 2019 ఎన్నికల్లో దుర్మార్గపు చంద్రబాబు పాలనకు ప్రజలు చరమగీతం పాడారన్నారు. 2024 ఎన్నికల తర్వాత చంద్రబాబు, పవన్‌లకు రాజకీయం చేయడానికి ఏమీ ఉండదన్నారు. రాష్ట్ర ప్రజల ఆశాజ్యోతి జగన్ అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు బాగుండాలని మహాయజ్ఞం చేయడం జరిగిందన్నారు. కేంద్రం నుంచి నిధులు రావడం మహాయజ్ఞం ఫలితమేనని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడం చంద్రబాబు ఉద్దేశ్యం కాదని, దాని పేరుతో వేల కోట్లు దోచేశారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పొనుకుమాటి శేషులత, వైస్ ఎంపీపీ సూర్నని రామకృష్ణ, సర్పంచ్‌లు పిచ్చికల రాజారావు, ఎలిపే గాంధీ, ఎమ్పీటీసీలు నార్ని శంకరరావు, కొమ్ముగూడెం సొసైటీ చైర్మన్ వెలిశెట్టి నరేంద్ర కుమార్, తహసీల్దార్ దుర్గా కిషోర్, ఎంపీడీవో ఎం.విశ్వనాథం, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షల పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలి

పెంటపాడు: ఏపీపీఎస్సీ, గ్రూపు1,2,3,4తో పాటు, ఆర్ఆర్‌బీ, బ్యాంకింగ్ తదితర పోటీ పరీక్షలకు సంబంధించి పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పెంటపాడు శాఖా గ్రంథాలయాధికారి మహ్మద్ జుల్ఫికర్ ఆలీ పేర్కొన్నారు. పెంటపాడు శాఖా గ్రంథాలయంలో ఆయన శనివారం మాట్లాడుతూ వేసవి విజ్ఞానం కార్యక్రమంలో భాగంగా పెంటపాడు మండల ప్రజలకు పలు పోటీ పరీక్షలకు సంబంధించి పుస్తకాలు సిద్ధం చేశామన్నారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థుల అవసరాలకు సంబంధించి మరిన్ని పుస్తకాలు అవసరం అయితే తప్పక అందుబాటులో ఉంచుతామన్నారు. ఉచిత కంప్యూటర్ శిక్షణతో పాటు, టైపింగ్ ప్రాథమిక మెలుకువలు కూడా విద్యార్థులకు నేర్పించనున్నట్లు ఆలీ తెలిపారు. పరిసర గ్రామాల విద్యార్థులు, చిరు ఉద్యోగులు, గృహిణిలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆదర్శప్రాయుడు విప్లవవీరుడు అల్లూరి

సాక్షి, భీమవరం: విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజును యువత స్ఫూర్తిగా తీసుకొని దేశ భద్రతకు కృషి చేయాలని క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు కోరారు. అల్లూరి 126వ జయంతోత్సవాలను పురస్కరించుకుని శ్రీవిజ్ఞానవేదిక, అల్లూరి సీతారామరాజు యువజన సంఘాల సమైక్య ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ క్షత్రియ కార్పొరేషన్ సహకారంతో స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో ఆదిత్య స్కూల్ విద్యార్థులతో 400 అడుగుల జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరాజు మాట్లాడుతూ బ్రిటిష్ పాలనపై అలుపెరగని పోరాటం సాగించి దేశం కోసం అమరులైన సీతారామరాజు అందరికీ ఆదర్శప్రాయుడన్నారు. ఈ సందర్భంగా 400 బైక్‌లతో ర్యాలీ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సరిపిడకల రామారావు, బేతు కృష్ణారావు, కుక్కల బాల, అరసవల్లి సుబ్రహ్మణ్యం, ఆదిత్య కృష్ణంరాజు, ఎం.సూర్యనారాయణరాజు, గొన్నాబత్తుల మల్లేశ్వరరావు, జనపాటి మధు, కడలి వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

డీఎన్నార్ విద్యార్థులకు ఉద్యోగాలు

సాక్షి, భీమవరం: డీఎన్నార్ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తమ విద్యార్థులు 60 మంది ఎంఎస్ఎన్ ల్యాబ్స్ హైదరాబాద్ ఫార్మాస్యూటికల్ అనే సంస్థలో ఏడాదికి రూ.2 లక్షలకు పైబడి ప్యాకేజ్‌తో ఉద్యోగాలు పొందారని కళాశాల వైస్ ప్రెసిడెంట్ గోకరాజు పాండురంగరాజు పేర్కొన్నారు. కళాశాల అసిస్టెంట్ సెక్రటరి కె.శివరామరాజు, ప్రిన్సిపాల్ బీఎస్ శాంత కుమారి మాట్లాడారు. పాలకవర్గ సభ్యుడు పి.రామకృష్ణంరాజు, పీజీ కోర్సెస్ డైరెక్టర్ ఎ.కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో విస్తృతంగా జగనన్న సురక్ష సర్వే

తణుకు టౌన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ గ్రామాల్లో వలంటీర్లు, సచివాలయ సచివాలయ సిబ్బంది, నాయకులు విస్తృతంగా పర్యటిస్తున్నారు. శనివారం కోనాల, కొమరవరం ముద్దాపురం, వేల్పూరు 1, 2, దువ్వ 1 గ్రామ సచివాలయం పరిధిలోని గ్రామాల్లో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు లబ్ధిదారులకు అవసరమైన సేవలను గుర్తించి నమోదు చేసే కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టారు.

తహసీల్దార్‌గా దుర్గా కిషోర్



తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన యద్ల దుర్గా కిషోర్

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండల తహసీల్దార్‌గా దుర్గాకిషోర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన వైకేవీ.అప్పారావు భీమవరం కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో దుర్గాకిషోర్ భీమవరం కలెక్టరేట్ నుంచి బదిలీపై తాడేపల్లిగూడెం తహసీల్దార్‌గా చార్జ్ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

శ్రీదేవి మహంకాళమ్మ విశేష పూజలు



మహంకాళమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని స్థానిక ఏలూరు రోడ్డులో వేంచేసియున్న శ్రీదేవి మహంకాళమ్మ నూతన ప్రతిరూప దేవాలయం 5వ వార్షికోత్సవాలు సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, రాగిడిమల్లి శ్రీనివాస శర్మ సిద్ధాంతి బ్రహ్మత్వంలో రాజశ్యామల యాగాం, హోమం నిర్వహించారు. నవోదయ ఫ్రెండ్స్ యూనియన్ అధ్యక్షుడు యెగ్గిన నాగబాబు, సభ్యులు పర్యవేక్షించారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

నీటి పొదుపు పట్ల విద్యార్థులు శ్రద్ధ వహించాలి

తణుకు టౌన్: నీటి యాజమాన్యం, పొదుపు పట్ల విద్యార్థులు అవగాహనతో మెలగాలని డ్వామా తణుకు టెక్నికల్ అసిస్టెంట్ శ్యామ్‌కుమార్ చెప్పారు. శనివారం తణుకులోని ఏలూరు నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో తణుకు మారుతీ జూనియర్ కళాశాలలో నిర్వహించిన క్యాచ్ ద రైన్ పై అవగాహనా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈకార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్‌ఆర్‌వీ నాగరాజు అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ నీటి పొదుపు, నిల్వ చేసే పద్ధతుల గురించి విద్యార్థులకు వివరించారు. ఈకార్యక్రమంలో నీటి పొదుపు సంబంధించి పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం వలంటీర్లు సానబోయిన ఝాన్సీ ప్రసన్న, జుత్తిగ అరుణ్ సాయి, వీరవల్లి సతీష్, జక్కంశెట్టి దుర్గా ప్రసాద్, కళాశాల సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నివారణ సాధ్యం



పట్టణంలోని వీకర్స్‌కాలనీలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నివారణ సాధ్యమని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రం వీకర్స్‌కాలనీలో శనివారం వైద్యాధికారి డాక్టర్ శ్రావ్య అధ్యక్షతన డెంగ్యూ నివారణ మాసోత్సవాలను ప్రారంభించారు. అవగాహన ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలో డెంగ్యూ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తద్వారా మునిసిపల్ శానిటేషన్ వారి సహకారంతో కీటక నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం సుబ్బారావుపేట మునిసిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డెంగ్యూ వ్యాధిపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వార్డు ఆరోగ్య కార్యదర్శులు, సహాయకులు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.